శిథిలావస్థలో బస్ షెల్టర్లు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు, పాలకులు


గౌరారం గ్రామ బస్ షెల్టర్ పరిస్థితి


రాంపూర్ గ్రామ బస్ షెల్టర్ పైకప్పు భాగం పరిస్థితి

పిట్లం(జుక్కల్): ముప్పై సంవత్సరాల క్రితం ప్రయాణికుల కోసం బస్ షెల్టర్‌లు నిర్మించారు. పిట్లం మండలంలో మద్దెల్ చెర్వు, గౌరారం, రాంపూర్, సిద్దాపూర్, చిన్నకొడప్‌గల్ గ్రామాలలో నిర్మించిన బస్ షెల్టర్లు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిల్చుంటున్నారు. రాంపూర్, సిద్దాపూర్ గ్రామాలలో రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా రోడ్డు ఎత్తుగా పెంచడంతో బస్టాండ్‌లోనికి వర్షపు నీరు చేరుతోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సిద్దాపూర్ గ్రామంలో ఉన్న బస్టాండ్ శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానికులు పశువులను కట్టేస్తున్నారు. దీంతో బస్ షెల్టర్, పశువుల కొట్టంలా మారింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికి పాలకులు శిథిలావస్థకు చేరిన బస్ షెల్టర్ల వైపు దృష్టిసారించక పోవడం దురదృష్టకరం. ఇప్పటికైన పాలకులు స్పందించి మండలంలో శిథిలావస్థకు చేరిన బస్ షెల్టర్లకు మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్యలకు నిలయంగా పిట్లం బస్టాండ్

పిట్లం బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారింది. ఈ బస్టాండ్‌లో ప్రతినిత్యం సుమారు 15 వందల మంది ప్రయాణికులు ఆయా ప్రాంతాలకు ప్రయాణం కొనసాగిస్తున్నారు. బస్టాండ్ శిథిలావస్థకు చేరడంతో పాటు కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల ప్రజలు బస్టాండులో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరుగుదొడ్లు సరిగా లేక తాగునీరు లేకపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఉన్న మరుగుదొడ్లలో దుర్వాసన వెదజల్లి ప్రాంగణం అంతా దుర్వాసన వస్తుండటంతో ప్రయాణికులు కనీసం నిల్చోలేకపోతున్నారు. కొత్తగా బస్టాండ్‌ను నిర్మించకపోయినా కనీసం మరమ్మతులైనా చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కన్నెత్తి చూడటం లేదు



శిథిలావస్థలో ఉన్న బస్టాండ్ల వైపు అధికారులు కానీ పాలకులు కానీ కన్నెత్తి చూడటం లేదు. నిత్యం 50 నుంచి 100 వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తున్నప్పటికి మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఎన్నికల్లో ప్రచారానికి వచ్చిన నాయకులు హామీలు గుప్పిస్తూ.. గెలిచిన తర్వాత హామీలను మరవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేయిస్తే బాగుంటుంది.

– పండరి, గౌరారం

రోడ్డుపై నిలబడాల్సి వస్తోంది



బస్టాండ్‌లు శిథిలావస్థకు చేరడంతో బస్సులు వచ్చేంత వరకు రోడ్డుపైనే నిలబడాల్సి వస్తోంది. మరుగుదొడ్లు లేక మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికుల వల్ల ఆర్టీసీకి ఆదాయం ఉన్నప్పటికి బస్టాండ్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఇప్పటికై నా అధికారులు, పాలకులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

– శ్రీనివాస్, రాంపూర్

క్లుప్తంగా

వెల్లుట్లవాసికి ఎల్‌వోసీ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): వెల్లుట్ల గ్రామానికి చెందిన పడేకుల నర్సింలు అనారోగ్యంతో హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. ఆయన వైద్యానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రూ.లక్షా 60 వేల ఎల్‌వోసీ చెక్కును అందించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సెల్‌ఫోన్ అందజేత



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన రేవుల సాయిరామ్‌కు సెల్‌ఫోన్‌ను అందించినట్లు ఎస్సై మహేష్ బుధవారం తెలిపారు. సాయిరాం తన సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడంతో ఫోన్ ఆచూకీ కనిపెట్టి బాధితుడికి అందించినట్లు ఎస్సై తెలిపారు.

రైతులు ఆందోళన చెందొద్దు



నిజాంసాగర్(జుక్కల్): వరిధాన్యం కొనుగోళ్ళ, ధాన్యం బస్తాల తరలింపు విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని మండల కాంగ్రెస్ నాయకులు జయప్రదీప్, రవీందర్‌రెడ్డి, మల్లికార్జున్ సూచించారు. బుధవారం నిజాంసాగర్ మండల కేంద్రంలో వారు మాట్లాడారు. రైస్ మిల్లుల్లో ధాన్యం బస్తాల నిల్వలకు స్థలం కొరత వల్ల కేంద్రాలకు లారీలు రావడం లేదన్నారు. వరిధాన్యం కొనుగోళ్ల విషయం, లారీల కొరతను స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు దృష్టికి తీసుకెళ్లారన్నారు. ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వపరంగా కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం ముసుగులో ప్రతి పక్ష పార్టీల నాయకులు రైతులను రెచ్చగొట్టడం సరికాదని చెప్పారు. నేతలు లక్ష్మయ్య, మోహన్ నాయక్, గౌస్ తదితరులున్నారు.

సురేశ్ షెట్కార్ గెలవాలని పూజలు



భిక్కనూరు: జహీరాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన సురేష్ షెట్కార్ గెలవాలని కోరుతూ భిక్కనూరు మాజీ ఎంపీపీ తోగరి సుదర్శన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు బుధవారం ఏడుపాయల వనదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు దశరథం, అశోక్, నర్సింహారెడ్డి, స్వామి యాదయ్య, శ్రీధర్, లింగం, శ్రీనివాస్, నర్సింలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాకు చెందిన బీఆర్‌ఎస్ మైనారిటీ నాయకులు జహంగీర్, గఫార్‌లు అనారోగ్యానికి గురయ్యారు. బుధవారం బాధితులను పరామర్శించిన ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు బాల్ చంద్రం, మాజీ సర్పంచ్ హంజీనాయక్, నాయకులు రాజాగౌడ్, గోవింద రెడ్డి, మల్లేష్ యాదవ్, తోకల కిషన్, మల్లేష్ ఉన్నారు.

స్విఫ్ట్ కొత్త మోడల్ ఆవిష్కరణ

కామారెడ్డి రూరల్: మారుతీ సుజుకీ కంపెనీ తయారు చేసిన సరికొత్త మోడల్ స్విఫ్ట్ కారును కామారెడ్డిలోని వరుణ్ మోటార్స్‌లో డీసీసీ అధ్యక్షుడు కై లాస్ శ్రీనివాస్ రావు చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ రాకేష్ మాట్లాడుతూ.. న్యూ 2 సిరీస్ ఇంజిన్, ఆరు ఎయిర్ బ్యాగ్‌లు, వైర్‌లెస్ చార్జర్, అత్యాధునిక భద్రత లాంటి ఫీచర్‌లతో తక్కువ ధరలోనే కొత్త మోడల్ స్విఫ్ట్ కారును విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో వర్క్స్ మేనేజర్ రమణ పటేల్, సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం



భిక్కనూరు: రామేశ్వర్‌పల్లి రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోల్లారపు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా జిల్లెల కొండల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా నాగార్తి నరేందర్‌రెడ్డి, కోశాధికారిగా సింగిరెడ్డి విలాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా సందుగారి రాజేందర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బోల్లారపు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..

రెడ్డి సంఘం అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. రెడ్డి సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు కందాడి లక్ష్మారెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు పైళ్ల సంతోష్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి నాగార్తి రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బెంచీల విరాళం


డీఎం సరితతో లయన్స్ క్లబ్ సభ్యులు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు బుధవారం బిచ్కుంద లయన్స్ క్లబ్(డైమండ్) ఆధ్వర్యంలో ఆరు బెంచీలు విరాళంగా అందించారు. ప్రయాణికుల కోసం బాన్సువాడ డీఎం సరిత చేతుల మీదుగా అందజేశారు. వృద్ధులు, వికలాంగులు, గర్భిణీలు బస్టాండ్‌లో కూర్చోడానికి బెంచీలు లేకపోవడం మా దృష్టికి వచ్చిందని, సేవా దృక్పదంతో విరాళంగా ఇచ్చామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఓంప్రకాష్ అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు గోపాల్, ప్రభాకర్, జగదీష్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు


నగదును అందజేస్తున్న నిర్వాహకులు

నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేటలో బుధవారం నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుపుతున్నారు. చివరి రోజు మల్లయోధుల కుస్తీ పోటీలు జరిపారు. పొరుగు రాష్ట్రాల నుంచి మల్లయోధులు తరలిరావడంతో కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. గెలుపొందిన మల్లయోధులకు నగదును బహుమానంగా అందజేశారు. ఎల్లమ్మ ఆలయ నిర్వాహకులు బంగ్లా ప్రవీణ్, బల్‌రాం, సత్యనారాయణ, రమేష్ కుమార్, నాగరాజు తదితరులున్నారు.

కోనాపూర్‌లో నీటి ఎద్దడి



బాన్సువాడ రూరల్: కోనాపూర్ గ్రామం డబుల్‌బెడ్‌రూం కాలనీవాసులు తాగు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. కాలనీలో ఒకే బోరు బావి ఉండటంతో నీళ్లు సరిపోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. బోరు బావి చెడిపోయి వారం గడుస్తున్నా మరమ్మతులు చేయించకపోవడంతో సమస్య తీవ్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

డీఎంహెచ్‌వోపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: వైద్యశాఖలో మహిళా వైద్యులను వేధింపులకు గురి చేస్తున్న డీఎంహెచ్‌వోపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ బుధవారం డిమాండ్ చేశారు. రాష్ట్ర వైద్యశాఖ అధికారులకు వైద్యులు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని, తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

కాశీ నృత్యోత్సవంలో ప్రతిభ



కామారెడ్డి అర్బన్: కామారెడ్డికి చెందిన సనాతన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో వారణాసి గంగా హారతి, మాత అన్నపూర్ణదేవి అమ్మవారి హారతి సమయాల్లో అస్సీఘాట్‌లో మూడు రోజుల పాటు నృత్యోత్సవం నిర్వహించినట్లు ఆర్గనైజర్ మాలోత్ నవీన్‌కుమార్ తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 250 మంది నృత్య కళాకారులు నృత్యోత్సవంలో పాల్గొన్నారని వెల్లడించారు. ప్రతిభ కనబర్చిన వారికి ఆలయ బాధ్యులు జ్ఞాపికలతో పాటు ప్రశంసా పత్రాలు అందించినట్లు నవీన్‌కుమార్ వివరించారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి


గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఎంపీడీవో నాగవర్ధన్

కామారెడ్డి రూరల్: గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్యను మరింతగా పెంచాలని ఎంపీడీవో నాగవర్ధన్ సూచించారు. బుధవారం కామారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఫాం పాండ్ నిర్మాణం చేపట్టేలా చూడాలని పేర్కొన్నారు. ఫాంపాండ్ నిర్మించుకునే రైతుల పేర్లను ఈ నెల 16లోగా అందజేయాలన్నారు. అలాగే గ్రామాల్లో కూలీలు పనులు చేసే చోట ఓఆర్‌ఎస్ బిల్లలు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఉపాధి పనులు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే చేపట్టాలని ఆదేశించారు. ఎంపీవో మలహరి, ఏపీవో నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): మాగి గ్రామ శివారులో కూలీలు చేపడుతున్న ఉపాధి పనులను బుధవారం ఎంపీడీవో గంగాధర్ పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. కొలతల ప్రకారంగా పనులు చేస్తేనే కూలీ గిట్టుబాటు అవుతుందని కూలీలకు ఆయన సూచించారు. ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ బాల్‌రాజ్, తదితరులున్నారు.


మాగిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగాధర్

పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని అధికారులకు వినతి


వినతి పత్రం అందజేస్తున్న కొండాపూర్ ప్రజలు

రాజంపేట: కొండాపూర్‌లో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం కొండాపూర్ గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్‌లకు వినతి పత్రాలను అందజేశారు. ఉమ్మడి తాడ్వాయి మండలంలోని పీహెచ్‌సీ(ఎర్ర పహాడ్)కి వెళ్లడం గర్భిణీలకు, పిల్లలకు ఇబ్బందిగా ఉందని తెలియజేశారు. కొండాపూర్ చుట్టుపక్కల తండాల ప్రజలు ఎర్రపహాడ్ పీహెచ్‌సీకి వెళ్లాలంటే కామారెడ్డి చుట్టూ తిరిగి దాదాపు 70 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని, అధికారులు స్పందించి కొండాపూర్‌లో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని కోరారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


క్రీడాకారులతో అధికారి దామోదర్‌రెడ్డి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): క్రీడలు ఆడటం వల్ల మానసిక ఉల్లాసం కలగడమే కాకుండా శరీరం దారుఢ్యంగా తయారవుతుందని జిల్లా యూత్ క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న వాలీబాల్ సమ్మర్ క్యాంపును బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటలు ఆడాలన్నారు. యువత సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడడం వల్ల మానసిక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. శారీరక శ్రమతో కూడిన ఆటలు ఆడినట్లయితే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఈ సమ్మర్ క్యాంపు ఈనెల 31 వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వైసీ అధ్యక్షుడు జగదీష్, మాజీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సీనియర్ క్రీడాకారుడు స్వామి, పీఈటీ బాలయ్య పాల్గొన్నారు.

సమాచారం..

18న స.హ చట్టంపై అవగాహన తరగతులు

కామారెడ్డి అర్బన్: సమాచార హక్కు(స.హ) చట్టంపై అవగాహన కోసం ఈనెల 18న ఉదయం 9.30 గంటలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు స.హ చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంపీ భాస్కర్ తెలిపారు. స.హ చట్టం ప్రయోజనాలు, ప్రజల సామాజిక బాధ్యత, చట్టంలోని వివిధ సెక్షన్ల గురించి రాష్ట్ర డైరెక్టర్ ఎం సలీం వివరిస్తారన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరుతున్నామని కళాశాల ప్రిన్సిపల్ యూసుఫ్ హుస్సేన్ తెలిపారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం నాణ్యమైన విద్య, ఉచిత పుస్తకాల సరఫరా, ఉపకార వేతనాలు అందిస్తుందన్నారు. మండలంలోని 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

18న మున్నూరుకాపు విద్యార్థులకు సన్మానం

కామారెడ్డి అర్బన్: పదవ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన మున్నూరుకాపు విద్యార్థులను ఈనెల 18న సన్మానించనున్నట్లు మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిండ్ల అంజయ్య, పెట్టుగాడి అంజయ్యలు తెలిపారు. 9.5 జీపీఏ సాధించిన 10వ తరగతి, 950 మార్కులకు పైగా సాధించిన ఇంటర్ మున్నూరుకాపు విద్యార్థులు తమ పేర్లను నమోదు చేయించాలని, వివరాలకు 9441631943, 9963007364, 9440659352 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో శ్రీధర్ రావు బుధవారం తెలిపారు. ఈ నెల 24 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

సంక్షిప్తం

'వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి'



కామారెడ్డి రూరల్: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎల్‌పీవో పీపీ శ్రీనివాస్ సూచించారు. బుధవారం శాబ్దిపూర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామంలో సానిటేషన్‌పై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. వేసవి దృష్ట్యా నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలని ప్రతి నర్సరీలో 10 వేల మొక్కలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎంపీవో మలహరి, గ్రామ కార్యదర్శి గణేష్, కారోబార్ నర్సాగౌడ్ తదితరులున్నారు.

సదాచార శిబిర సమారోప్ కార్యక్రమం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రాహ్మణపల్లిలో పది రోజుల సదాచార శిబిర సమారోప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైదిక సంచార యజ్ఞ రథం కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మఠంలో బాలబాలికలకు 10 రోజుల పాటు ఆధ్యాత్మిక ప్రవచనం, సాంస్కృతిక, యజ్ఞం తదితర కార్యక్రమాలను చేపట్టారు. సరళజీవనం, ఆధ్యాత్మిక, ఉన్నతచింతనం, జీవన శైలి తదితర వాటిపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలో బాలబాలికలతో ర్యాలీ నిర్వహించారు.

భగళాముఖి అమ్మవారి జన్మదిన వేడుకలు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో భగళాముఖి అమ్మవారి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బగళాముఖి అమ్మవారి పీఠంలో వైశాఖ మాసం అష్టమిని పురస్కరించుకుని ప్రముఖ జ్యోతిష్య పండితులు క్రాంతి పటేల్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ కో-చైర్మన్, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్, కంచర్ల లింగం, సిద్ధి శ్రీధర్‌లు హాజరై పూజలు చేశారు.